క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన విండో డైరెక్టర్



కోడేరు: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ మల్లెపల్లి జగన్‌మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మండలానికి అత్యధిక నిధులు కేటాయించాలని కోరారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా హన్మంత్‌రెడ్డి



అచ్చంపేట రూరల్: ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన హన్మంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర బాధ్యుడు మామిళ్ల సుదర్శన్ తెలిపారు. ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా, జిల్లా, రాష్ట్ర కార్యదర్శిగా హన్మంత్‌రెడ్డి పనిచేశారని పేర్కొన్నారు. హన్మంత్‌రెడ్డి ఎన్నికపై రమేష్, మురళి, శ్రీధర్‌రావు, సుదర్శన్, పుల్లారెడ్డి, మధుసూదన్ రెడ్డి హర్షం ప్రకటించారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి



బిజినేపల్లి: రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న కలిగిన ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలో చేర్చాలని ఆ సంఘం నాయకులు వెంకటస్వామి, అల్లోజీ డిమాండ్ చేశారు. సోమవారం ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. 50 సంవత్సరాలు నిండిన మత్స్యకారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, మత్స్యకార సొసైటీలకు రూ.100 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సహదేవుడు, బంగారయ్య, బాలస్వామి, యాదయ్య, గంగాధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా ఇద్దరికి గాయాలు

బిజినేపల్లి: అదుపుతప్పి ఆటో బోల్తా పడి ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని వెల్గొండలో సోమవారం చోటుచేసుకుంది. బాజీపూర్ తండాకు చెందిన కుటుంబసభ్యులు ఆటోలో మంగనూర్ మీదుగా వెల్గొండ పీర్లను దర్శించుకునేందుకు వెళ్తున్నారు. వెల్గొండ కాలనీ సమీపంలో ఆటో అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 7 మందిలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

నీటిపారుదల అధికారుల సర్వే



పెద్దకొత్తపల్లి: మండలంలోని పెద్దకార్పాముల గ్రామం నుంచి కేఎల్‌ఐ కాల్వ ద్వారా చిన్నకొత్తపల్లి, జగన్నాథపురం, యాపట్ల, మారేడుమాందిన్నె గ్రామాలకు సాగునీరు అందించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం సర్వే నిర్వహించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు అధికారులు సర్వే చేసినట్లు మాజీ జెడ్పీటీసీ మేకల గౌరమ్మ చంద్రయ్య తెలిపారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి

నాగర్‌కర్నూల్‌రూరల్: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం సంయుక్త కార్యదర్శి వెంకట్‌రాములు మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు డబల్ బెడ్‌రూం ఇళ్లు, విద్యాశాఖలో ఐదు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరారు. బ్యాక్‌లాక్ పోస్టులకు వెంటనే భర్తీ చేయాలని విన్నవించారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శివశంకర్ మాట్లాడుతూ జిల్లాలో 42 మంది పనిచేస్తున్నారని వారిని ఎన్‌హెచ్‌ఎంలో కలపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు భాగ్యలక్ష్మి, పద్మ, శ్రీలత, విజయ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- రోడ్లపైనే మురుగు పరుగు
- పట్టించుకోని అధికారులు



రెండో వార్డులో సీసీ రోడ్డు పై పారుతున్న మురుగు



పాల్మూరులో చెత్తాచెదారంతో నిండిన మురుగు కాల్వ

తాడూరు: గ్రామాల్లో సర్పంచ్‌ల పదవికాలం ముగియడంతో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి పల్లెల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం గ్రామాల వైపు చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో పర్యటించకుండ కార్యాలయాలకే పరిమితం కావడం వల్ల గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రానికి ప్రత్యేకాధికారి ఎంపీడీఓ జ్యోతిపరోసియాను కేటాయించినా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ఆరోపించారు. మండల కేంద్రంలో రోడ్లపైనే మురుగు పరుగులు పెడుతున్నా చూసిచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఫోన్ చేసిన స్పందించడం లేదని పలువురు ఆవేధన వ్యక్తం చేశారు. గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇంద్రకల్, సిర్సవాడ, మేడిపూర్, పాల్మూరు, గుంతకోడూరు, యాదిరెడ్డిపల్లి, చర్ల ఇటిక్యాల, చర్ల తిరుమలపురం, అల్లాపూర్ తదితర గ్రామాల్లో డ్రెయినేజీ కాల్వలు మురుగు, చెత్తా చెదారం నిండి కంపు కొడుతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగి మురుగు పారకుండా అడ్డుపడుతున్నాయి. దీంతో రోడ్లపైకి మురుగు చేరి రోడ్లు చిత్తడిగా మారాయి. మురుగుతో కంపు వాసన భరించలేకపోతున్నామని పలు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.

తప్పని తిప్పలు

మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల ప్రజలు డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో స్థానికులకు తిప్పలు తప్పడం లేదు. మురుగు కాల్వలు శుభ్ర చేయకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. గ్రామీణులు విష జ్వరాల భారిన పడుతున్నారు. గ్రామ ప్రత్యేకాధికారులు తెలిసినా పట్టించుకోవడం లేదు. చెత్త, మురుగు నిల్వ ఉన్న ప్రదేశాలలో గ్రామపంచాయతీ సిబ్బంది కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడ చల్లడం లేదని వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే వ్యాధులబారిన పడుతున్నామని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

చెత్తాచెదారం తొలగించాలి



గ్రామాల్లో మురుగు కాల్వలో చెత్తా చెదారం తొలగించాలి. పిచ్చి మొక్కలు పెరగడంతో రోడ్లపైనే మురుగు పారుతోంది. ప్రత్యేకాధికారులు గ్రామాలకు రావడం లేదు. పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల కేంద్రంలో ఆరు నెలలుగా హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు.

– నాగయ్య, మాజీ సర్పంచ్

సమస్యలు పరిష్కరిస్తాం



గ్రామాల్లో పర్యటించి నెలకొన్న సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తాం. పంచాయతీ కార్యదర్శులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. అధికారులకు ప్రజలు సహకరించాలి. పంచాయతీ సిబ్బంది ద్వారా మురుగుకాల్వను శుభ్రం చేయిస్తున్నాం. వానా కాలంలో రోడ్లపై మురుగు పారకుండా చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మణ్‌నాయక్, ఎంపీఓ, తాడూరు

లొద్ది మల్లయ్య క్షేత్రానికి అనుమతినివ్వండి

అచ్చంపేట రూరల్: నల్లమలలో వెలసిన లొద్ది మల్లయ్య దర్శనానికి అటవీశాఖ అధికారులు అనుమతులు ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మండికారి బాలాజీ డిమాండ్ చేశారు. సోమవారం అచ్చంపేట అటవీశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లొద్ది మల్లయ్య జాతరకు అటవీశాఖ అధికారులు ఆటంకాలు సృష్టించడం తగదన్నారు. పులుల సంతానోత్పత్తి పేరుతో లొద్ది మల్లయ్య దర్శనాన్ని పూర్తిగా నిషేధిస్తూ.. భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. లొద్ది మల్లయ్య దర్శనానికి వెళ్లే భక్తులను అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ, హిందూవాహిని, భజరంగ్‌దళ్ సంఘాల నాయకులు మంగ్యానాయక్, రేణయ్య, బలరాం, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే

మన్ననూర్: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని లొద్ది మల్లయ్య దర్శనానికి అనుమతి ఇవ్వాలని డీఎఫ్‌ఓ రోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యే వంశీకృష్ణ ఫోన్ చేసి కోరారు. ఇటీవల వివిధ పార్టీలు, హిందు సంఘాల నాయకులు అనుమతులు ఇప్పించాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. ఈ మేర కు ఎమ్మెల్యే అటవీ శాఖ అధికారులతో మాట్లాడారు.



అచ్చంపేటలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

ఆందోళన చేస్తాం

నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతంలోని లొద్ది మల్లయ్య క్షేత్రాన్ని దర్శించుకునేందుకు అటవీశాఖ అనుమతి ఇచ్చేంత వరకు ఆందోళన చేస్తామని అమ్రాబాద్ బీజేపీ మండల అధ్యక్షుడు గోలి రాజు ఆ పార్టీ సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. అడవుల్లో గుప్త నిధుల కోసం అనేక ప్రాంతాల్లో దుండగులు తవ్వకాలు చేస్తుంటే పట్టించుకోని అటవీశాఖ అధికారులు, సిబ్బంది హిందువుల పండగలపైన కావాలనే ఆంక్షలు విధిస్తుందని పేర్కొన్నారు. 17వ తేదీ నాడు కనీసం ఆంక్షలతో కూడిన అనుమతులైన ఇవ్వాలని వారు కోరారు.

విద్యార్థి సంఘాల నాయకుల ముందస్తు అరెస్టు



కొల్లాపూర్: విద్యారంగానికి సంబంధించిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు సోమవారం సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. ఈమేరకు మండలం నుంచి విద్యార్థి సంఘాల నాయకులు ముట్టడికి తరలివెళ్లకుండా ముందస్తు అరెస్ట్ చేశారు. ఆదివారం రాత్రి నాయకులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు అన్వేష్‌గౌడ్, జిల్లా నాయకులు ధారా శేఖర్, బీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

బిజినేపల్లి: పాలెం వేంకటేశ్వర ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడంతో ప్రిన్సిపాల్ డా. విద్యారాణిని మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ సోమవారం శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కళాశాల పూర్వ విద్యార్థులు రఫీ, రవీందర్‌రెడ్డి, జగదీష్, రామకృష్ణ, చందు, సుల్తాన్, శేఖర్, భాను, భాస్కర్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేస్తే గుర్తింపు



తాడూరు: ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో పని చేస్తే సమాజం గుర్తిస్తుందని ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు సురేందర్‌బాబు పదవి విరమణ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ భాస్కర్‌రెడ్డి, పీఆర్‌టీయూ నాయకులు సురేందర్‌రెడ్డి, శ్యాంసుందర్, అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు కన్నీటివీడ్కోలు

కోడేరు: మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలల్లో 10 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా పని చేసిన శ్రీలత, స్వామి బదిలీపై వెళ్తుండటంతో ఆ పాఠశాల విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. మమ్మల్ని విడిచి వెళ్లొందంటూ బోరున విలపించారు. కంటతడి పెట్టిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఓదార్చారు.

చారకొండ: మండలంలోని తుర్కలపల్లిలో బదిలీ అయిన ఉపాధ్యాయులు స్వాతి, మంజురాణి, కవితను సోమవారం పాఠశాలలో వీడ్కోలు పలికారు. సమావేశానికి ఎంఈఓ శంకర్ నాయక్, కాంప్లెక్స్ హెచ్‌ఎం భగవాన్ రెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నయ్యలు వారిని సన్మానించారు. అదే విధంగా పాఠశాలలో 45 సంవత్సరాలుగా అంటెండర్‌గా విధులు నిర్వర్తించి పదవి విరమణ నిరంజన్‌ను సన్మానించారు.

అవగాహన ర్యాలీ

బల్మూర్: మండల కేంద్రంలో సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అమ్మమాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓ లక్ష్మి, సూపర్‌వైజర్లు నిర్మల, విజయలక్ష్మి, సునీత, జయప్రద, శ్రీదేవి, భాగ్యమ్మ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

కల్వకుర్తిరూరల్: మండలంలోని ఎల్లికల్ గ్రామానికి చెందిన యువతి స్వాతి అదృశ్యంపై సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల ప్రకారం ఈ నెల 11వ తేదీన యువతి ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. తెలిసిన బంధువుల, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ తెలువలేదు. దీంతో యువతి తండ్రి జల్లెల్ల మల్లేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తాగునీటి సమస్యపై అధికారుల పర్యవేక్షణ



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్లలో 20 రోజులుగా తాగునీటి సమస్య నెలకొందని గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు సోమవారం మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి సోమవారం గ్రామంలో పర్యటించారు. పుర్గర్‌చర్లలో నూతన సీసీ రోడ్డు నిర్మాణంతో తాగునీటి పైపులైన్‌లో అంతరాయం ఏర్పడిందని, త్వరలోనే ఆ సమస్యలు పరిష్కరించి గ్రామంలోని అన్ని కాలనీలకు తాగునీరు అందేలా చూస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

భూ కబ్జాపై సోషల్ మీడియాలో వైరల్

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లిలో భూమి కబ్జాకు గురైందని సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొల్లంపల్లి గ్రామానికి చెందిన ఉప్పు జయరాములు పేరున సర్వే నెంబర్ 207, 230, 231, 232, 233, 235, 238లో 15.31 ఎకరాల భూమి ఉంది. జయరాములు 2017లో మృతి చెందాడు. ఆయన భార్య ఉప్పు పుష్పలత 3.21 ఎకరాలు, కుమారులు లక్ష్మీ నర్సింహ్మారావు 6.05 ఎకరాలు, హనుమంతురావు 6.04 ఎకరాల భూమిని 2019సంవత్సరంలో భాగ పరిష్కారం చేసుకున్నారు. వారిపై ఉన్న భూమిని గ్రామానికి చెందిన ఉప్పు గోవింద్‌రావు, అయోధ్యరామయ్య, మధన్‌మోహన్‌రావులు అక్రమంగా పట్టాభూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గత రెండు నెలల కిందట ఆన్‌లైన్‌లో అసలు పట్టాదారుల పేర్లు కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. దీంతో గ్రామ పెద్దల సమక్షంలో ఆదివారం పంచాయతీ నిర్వహించారు. కొంత మంది రాజకీయ నాయకుల అండదండలతో భూమిని కబ్జా చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. పంచాయతీకి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మండలంలో భూ కబ్జాపై జోరుగా చర్చ జరుగుతోంది. ఘటనకు సంబంధించి వారం రోజులుగా గ్రామంలో వివాదం జరుగుతున్న ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది.

విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

పెద్దకొత్తపల్లి: మండలంలోని కల్వకోల్ గ్రామం వద్ద జాతీయ రహదారిపై 11 కేవీ విద్యుత్ స్తంభం సోమవారం విరిగి పడింది. దీంతో వాహన రాకపోకలకు రెండు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. ఇటీవల జాతీయ రహదారి కల్వకుర్తి నుంచి నంద్యాల వరకు నిర్మాణం చేస్తున్న రోడ్డు పనుల్లో భాగంగా రోడ్డుకు 11 కేవీ విద్యుత్ వైర్‌లు ఓవైపు నుంచి మరోవైపు వెళ్లేందుకు రెండు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. వాటికి వైర్లు లాగి కనెక్షన్ ఇచ్చారు. సోమవారం సాయంత్రం వర్షానికి ఒక వైపు ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడి రోడ్డుపై పడింది. విద్యుత్ వైర్లు రోడ్లపై పడటంతో వాహనరాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు గంటల తర్వాత విద్యుత్ అధికారులు మరమ్మతు పనులు చేపట్టారు. అనంతరం వాహనాల రాకపోకలు కొనసాగాయి.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ

అమ్రాబాద్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అమ్రాబాద్ ఉర్దూ మీడియం పాఠశాల నుంచి ప్రధాన వీధులగుండా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ మాట్లాడుతూ నూతన విద్యావిధానంలో భాగంగా అంగన్‌వాడీకి వచ్చే చిన్నారులకు నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విధానంతో ప్రీప్రైమరీ స్కూల్ విద్యను అందుబాటులోకి వచ్చిందన్నారు. అంతేగాకుండా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు గర్భిణీ, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం, వైద్య సలహాలు, సూచనలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవగాహన ర్యాలీలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ టీచర్లు చంద్రకళ, అస్మత్‌బేగం విద్యార్థులు, పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

కుక్కల దాడిలో 50 నాటుకోళ్లు మృతి

లింగాల: వీధి కుక్కల దాడిలో 50 నాటుకోళ్లు మృతి చెందిన ఘటన సోమవారం మండల పరిధిలోని కోమటికుంటలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గడ్డి పోగుల కాసీం తన పొలంలో నాటు కోళ్లను పెంచుతున్నాడు. రోజు మాదిరి షెడ్‌లో నాటుకోడి పుంజులకు దాణా వేసి ఇంటికి వెళ్లాడు. ఎవరు లేని సమయంలో గ్రామంలోని వీధి కుక్కలు గుంపులుగా షెడ్ దగ్గర కోళ్లపై దాడి చేసి 50 పుంజులను చంపివేశాయి. రైతు ఇంటికి వెళ్లి షెడ్ దగ్గరకు వస్తుండగా కుక్కలు కోళ్లను తింటుండడం గమనించి కుక్కలను అక్కడి నుంచి తరిమికొట్టాడు. మృతి చెందిన పుంజుల విలువ రూ.40 వేల వరకు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. గ్రామంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేధన వ్యక్తం చేశారు.

17న రామాలయంలో సామూహిక వ్రతాలు

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 17న బుధవారం 24 జంటలతో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పేర్ల నమోదుకు సెల్: 9704488916, 9949122663 నంబర్లను సంప్రదించాలని కోరారు.

డ్రైవర్‌పై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని శ్రీశైలం–హైదరాబాద్ రహదారిలో లత్తీపూర్ స్టేజీ సమీపంలో గత ఏప్రిల్ 25న బైక్‌ను కారు ఢీకొట్టి ఇద్దరు గాయాలపాలైన ఘటనపై బాధితుడు అయ్యవారిపల్లికి చెందిన చెన్‌రెడ్డి యాదిరెడ్డి సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా పోరంకి పెనమలూరు గ్రామానికి చెందిన కారు డ్రైవర్ కృష్ణ చైతన్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లెనిన్ తెలిపారు.

మైక్‌సెట్ వితరణ

చారకొండ: మండలంలోని తుర్కలపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు గంట నరేష్, సురేష్‌లు రూ.15 వేల విలువైన మైక్ సెట్‌ను సోమవారం హెచ్‌ఎం మహిపాల్‌నాయక్‌కు అందించారు. వారిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



కల్వకుర్తిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా నడిపిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు సంతోష్ మాట్లాడుతూ సీబీఎస్‌ఈ అనుమతి లేకున్నా అనుమతి ఉన్నట్లు బోర్డులు ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా ఫీజుల వసూలు చేస్తున్నారన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులను ఈ విషయంపై ప్రశ్నిస్తే ఎవరికైనా చెప్పుకోండని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని పేర్కొన్నారు. నాయకులు సంతోష్, లక్‌పతినాయక్, అర్జున్, నితిన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

చారకొండ: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ కేసీ ప్రమీల తెలిపారు. ప్రజావాణి ఫిర్యాదులను త్వరతగతిన పరిష్కరిస్తామన్నారు. ప్రజావాణికి గైర్హాజరైన అధికారుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

తెలకపల్లి: మండలంలోని గోలగుండంలో సోమవారం నాగర్‌కర్నూల్, అచ్చంపేట త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి హిందూజ్ఞాన వేదిక కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయిశంకర్ శ్రేష్టి, మనోహర్ శ్రేష్టి, నర్సింహ, వెంకటయ్య, బుచ్చాచారి, స్వప్న, రమాదేవి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

బీటీ లేక వాహనదారుల ఇక్కట్లు



కల్వర్టువద్ద కంకర తేలి ఉన్న రహదారి

అమ్రాబాద్: మన్ననూర్, మద్దిమడుగు ప్రధాన రహదారిపై అమ్రాబాద్ మండలం కొత్తపల్లి స్టేజివద్ద నూతనంగా నిర్మించిన కల్వర్టు వద్ద బీటీ వేయక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ పనులను అప్పటి ఎమ్మెల్యే 2023వ సంవత్సరం జూలై 6న ప్రారంభించారు. కల్వర్టు ప్రారంభమైన ఇప్పటివరకు బీటీ నిర్మాణం చేపట్టలేదు. కంకరవేసి వదిలేశారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ లక్ష్మీపతి నాయక్ ను వివరణ కోరగా కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి



కొల్లాపూర్ కేఎల్‌ఐ అతిథిగృహం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు



నాగర్‌కర్నూల్‌లో..



కల్వకుర్తిలో..

సాక్షి, నెట్‌వర్క్: అంగన్‌వాడీ టీచర్ల, ఆయాల సమస్యలు పరిష్కరించకుంటే ప్రజాభవన్ ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు హెచ్చరించారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, రూ.5వేల పింఛన్, జీఓ నంబర్ 10ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో ముట్టడించారు. అనంతరం క్యాంపు కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 19న చలో ప్రజాభవన్‌కు పిలుపునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకురాలు కందికొండగీత, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు చంద్రకళ, రజియా, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు క్యాంపు కార్యాలయమైన కేఎల్‌ఐ అతిథిగృహాన్ని సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు ముట్టడించారు. పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని క్యాంపు కార్యాలయ అధికారులు కృష్ణయ్య, నాగరాజు, కాంగ్రెస్ నాయకుడు పసుపుల నర్సింహ్మలకు అందజేశారు. అచ్చంపేటలో ఎమ్మెల్యే వంశీకృష్ణ నివాసాన్ని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ముట్టడించారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఎమ్మెల్యే వద్దకు వెళ్లి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 19న హైదరాబాద్ డైరెక్టర్ ఆఫీసు ముట్టడిస్తున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందుబాటులో లేకపోవడంతో మాజీ సర్పంచ్ ఆనంద్‌కు వినతిపత్రం ఇచ్చారు.